ప్రజాశక్తి

శుక్రవారం 2 జూన్ 2023 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

పేరాలలో రోడ్లపై పడిన భారీ చెట్టు

గాలివాన బీభత్సం

- చీరాలలో నేలకొరిగిన చెట్లు, తెగిన విద్యుత్ తీగలు
- దండుబాటలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

దండుబాట ప్రాంతంలో కరెంటు తీగలపై వేలాడుతున్న ఇనుప రేకులు

ప్రజాశక్తి-చీరాల

చీరాల ప్రాంతంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండగా.. మధ్యాహ్నానికి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని ఈదురుగాలులతో వర్షం కురిసింది. భారీవర్షంతో, ఈపురుపాలెం, పేరాల, విజయనగర కాలనీ వంటి పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభంలు నేలకొరిగాయి. పలు చోట్ల రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు రోడ్లకు అడ్డంగా పడిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరగటంతో విద్యుత్ సరఫరా నిలిచి.. ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. భారీవర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దండుపాటి ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈపూరుపాలెంలో ఈదురు గాలులకు పెద్ద చెట్లు పడిపోవడంతో పంచాయతీ కార్యదర్శి గౌస్‌బాషా క్రేన్ ▶ 2లో

ధర్నా చేస్తున్న రైతు, కౌలు రైతుసంఘాల నేతలు

'గుండ్లకమ్మ' గేటును

రెండు నెలల్లో రిపేరు చేయాలి

- చివరి భూముల వరకు నీరందించాలి
- లేకపోతే ఆందోళనలు చేస్తాం.
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మద్దిపాడు

రెండు నెలల్లో గుండ్లకమ్మ ప్రాజెక్టును రిపేరు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పమిడి వెంకట్రావు మాట్లాడుతూ ప్రాజెక్టు గేటు విరిగి సంవత్సరం అవుతున్నా వాటిని మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యదోరణిని ప్రదర్శిస్తోందన్నారు. ప్రాజెక్టు మెయింటెన్స్ సరిగ్గా లేదన్నారు. నిండుగా ఉండాల్సిన ప్రాజెక్టు నేడు ప్రభుత్వ అసమర్థత వల్ల అట్టడుగున నీళ్లు దర్శనమిస్తున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారానే 80 గ్రామాలకు తాగునీరు, వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు నీరు లీకు అవడంతో చివర ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, వాటికి కావల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు. గేటును రిపేరు చేస్తున్నామని చెప్పడం తప్పితే ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. రైతుసంఘం జిల్లా ▶ 2లో

పార్టీలోని కొందరు

నాపై దుష్ప్రచారం చేశారు..

- నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇళ్ల స్థలాలు రెడీ
- ఎప్పుడూ సిఎంను కలుస్తూనే ఉంటా..
- సిఎం జగన్‌తో బాలినేని భేటీ
- అన్ని విషయాలూ చర్చించామని వెల్లడి

సిఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రోటోకాల్ గురించి తాను ఎప్పుడూ ఫీలవ్వలేదని, కావాలనే పార్టీలోని కొందరు మీడియాకు లీకులు ఇచ్చి దుష్ప్రచారాలు చేశారని.. ఈ విషయం సిఎం జగన్‌తో చెప్పానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పదవినే వదులుకొని వచ్చానని, ప్రోటోకాల్ గొడవ ఏముంటుందని అన్నారు. సిఎం జగన్‌తో మాజీ మంత్రి బాలినేని గురువారం నాడు భేటీ అయ్యారు. పార్టీలో కొందరు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ప్రకటించిన బాలినేని కొద్దిరోజులుగా అసంతృప్తిగా ఉన్నారు. మళ్లీ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొంటున్నారు. ఈ తరుణంలో సిఎం జగన్ నుంచి ఆయనకు పిలుపువచ్చింది. దీంతో గురువారం సాయంత్రం బాలినేని తాడేపల్లి వెళ్లి సిఎం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. అనేక విషయాలు సిఎం జగన్ వద్ద ప్రస్తావించారని సమాచారం. ప్రధానంగా ఆయన ఇటీవల పార్టీలోని కొందరు తనపై ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తున్నారని వెల్లడించిన సంగతి తెలిసిందే.. మీడియా సమావేశంలోనూ భావోద్రేకానికి గురయ్యారు. వీటిపైనా సిఎం జగన్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. తన సమీప బంధువు, ఇతర కీలక నేతల వ్యవహారశైలిపైనా సిఎం జగన్‌తో చర్చించినట్లు తెలిసింది. సిఎంతో భేటీ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తన నియోజకవర్గం గురించి సిఎం జగన్ అడిగారని వెల్లడించారు. జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి కూడా అడిగారన్నారు. రీజినల్ కోఆర్డినేటర్ పదవి వద్దని అప్పుడే చెప్పానని వివరించారు. తమ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇళ్ల స్థలాలు రెడీ చేస్తున్నామని బాలినేని చెప్పారు. దీని గురించి కూడా సిఎం జగన్‌తో చర్చించామన్నారు. అలక ఎప్పుడూ లేదన్నారు. పార్టీలో కొందరు ఇబ్బంది పెట్టారని, దానిపైనే ఫైట్ చేశామన్నారు. ఎప్పుడూ సిఎంను కలుస్తూనే ఉంటానని, గతంలోనూ వారానికి ఒకసారి కలిశానని బాలినేని ▶ 2లో

మాట్లాడుతున్న ఎస్‌పి మల్లికగర్గ్

వ్యక్తి కిడ్నాప్ కేసును..

11 గంటల్లో ఛేదించాం

ఎస్‌పి మల్లికగర్గ్

▶ 2లో

నాపై దుష్ప్రచారం చేశారు..

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. టిడిపి వాళ్ల కోర్టుల్లో వేసినందునే ఇళ్ల స్థలాలు ఆగాయన్నారు. మళ్లీ తాము ఇస్తున్నామని, దీనికి సంబంధించిన సగం నిధులు కూడా రిలీజ్ అయ్యాయన్నారు. మిగతా వాటి గురించి సిఎం జగన్‌తో చర్చించామని బాలినేని వెల్లడించారు. ఇక బాలినేని భేటీ నేపథ్యంలో జిల్లా వైసిపి నేతల్లో ఉత్కంఠ నెలకొంది. కీలక నేతలు కూడా ఆయన భేటీపై దృష్టి సారించారు. ఎవరిపై ఏమి చెప్తారోనన్న ఉత్కంఠ నేతల్లో కనిపించింది. తనకు జరిగిన ఇబ్బందులపైనే ప్రధానంగా బాలినేని ఈ భేటీలో సిఎం వద్ద ప్రస్తావించారు. పార్టీ పరిస్థితిపైనా, ఇద్దరి మధ్య చర్చ సాగింది. ఈ విషయాన్ని బాలినేనే వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా ఏమైనా నివేదిక ఇచ్చారా? ఎక్కడ ఎవరికి టిక్కెట్లు ఇవ్వాలనే ప్రతిపాదన బాలినేని చేశారా.. అనేదీ చర్చగా మారింది. అయితే బాలినేని భేటీలో చర్చకు వచ్చిన అన్ని విషయాలూ బయటకు చెప్పలేదు. ఇక బాలినేనికి జిల్లా బాధ్యతలపై సిఎం జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారు? బాలినేనికి ఈ విషయంపై ఏమైనా స్పష్టత ఇచ్చారా? అనేదీ తేలాల్సి ఉంది. తనను ఇబ్బంది పెట్టిన నేత విషయంలో సిఎం ఎలాంటి భరోసా ఇచ్చారనేదీ చూడాలి.ఏదేమైనా తాడేపల్లిలో సిఎం జగన్‌తో బాలినేని భేటీ జిల్లా పాలకపక్షంలో ఉత్కంఠ చర్చకు తావిచ్చింది.

'గుండ్లకమ్మ' గేటును రెండు నెలల్లో రిపేరు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యక్షులు జయంతిబాబు మాట్లాడుతూ త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందన్నారు. రైతులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వెంటనే ప్రాజెక్టు గేటును రిపేరు చేయించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మాబు మాట్లాడుతూ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయాలని ముందుగానే అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా నేడు ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ప్రాజెక్టుకు ఎదురుగానే ఎమ్మెల్యే నివాస గృహం ఉన్నా అవేమీ పట్టనట్లు వ్యవహరించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసిపి నేడు వారిని పట్టించుకోవడం లేదని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టి.. తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఏ లక్ష్యంతో అయితే జల యజ్ఞం పేరిట అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారో నేడు ఆ లక్ష్యం నీరుగారి పోతుందన్నారు. నేడు తాగు, సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రైతు సంఘం మద్దిపాడు మండల నాయకులు వెంకటరామిరెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు ఖాసిం, ఐద్వా మండల అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కౌలు రైతుసంఘం నాగులుప్పలపాడు నాయకులు తాటిబండ్ల యోహాను, సిఐటియు మద్దిపాడు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, పాలపర్తి యోన, గాదె నాగేశ్వరరావు, చెరుకూరి వాసు, కనపర్తి ఇర్మియా పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా చెట్లను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు.

రోడ్లను పరిశీలించిన కరణం వెంకటేష్

ఈదురుగాలుల ధాటికి పేరాల, వాడరేవు రహదారిపై భారీ చెట్లు పడిపోవడం పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడిన పలు ప్రాంతాలలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి.. సంబంధిత అధికారులతో పరిశీలించారు. పలు చోట్ల రేకుల షెడ్లు పడిపోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. తక్షణమే విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు విద్యుత్ సరఫరాను కొనసాగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

వ్యక్తి కిడ్నాప్ కేసును...

11 గంటల్లో ఛేదించాం : ఎస్‌పి

ప్రజాశక్తి-దర్శి

ఓ వ్యక్తి కిడ్నాప్ కేసును పోలీసులు 11 గంటల వ్యవధిలోనే ఛేదించినట్లు ఎస్‌పి మల్లిక గర్గ్ తెలిపారు. దర్శి పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఎస్‌పి ప్రారంభించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ బేస్తవారిపేట మండలం, పూసలపాడు గ్రామంలో బుధవారం కిడ్నాప్‌కు గురైన పెద్దిరెడ్డి రామిరెడ్డి కేసును ఛేదించడంలో మార్కాపురం డిఎస్‌పి వీరరాఘవరెడ్డి, కంభం సిఐ రాజేష్‌కుమార్, బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు ఎస్‌ఐ కీలకపాత్ర పోషించారని అభినందించారు. నిందితులు పసుపుల రాము, బోయ నాగార్జున, బట్రాజ్ కేధార్‌నాథ్‌ని అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. కిడ్నాప్‌కు గురైన పెద్దిరెడ్డి రామిరెడ్డిని 11 గంటలలో నంద్యాలలో ఉన్నట్లు గ్రామ గుర్తించి కాపాడినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి సిఐ జె రామకోటయ్య, ఎస్‌ఐ రామకృష్ణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

'విజయశ్రీ'లో రాయితీపై వైద్యసేవలు

ప్రజాశక్తి-ఒంగోలుసబర్బన్

దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక 60 అడుగుల రోడ్డులోని విజయశ్రీ హాస్పిటల్ లో తెల్లరేషన్‌కార్డు దారులకు 50 శాతం రాయితీపై గురువారం వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాయితీపై వైద్యసేవలను 47 మంది సద్వినియోగం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన తమ వైద్యశాలలో 50 శాతం రాయితీపై వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-పొదిలి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్న వాలంటీర్లు ప్రజల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం వాలంటీర్లను సన్మానించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకృష్ణ, ఇఒఆర్‌డి రాజశేఖర్, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, బిసి సెల్ అధ్యక్షుడు పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మల్లాపురం చిన నరసింహులు, మాదాలవారిపాలెం సహకార సంఘం అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేపై అవగాహన

సిఎస్ పురం రూరల్: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహశీల్దార్ మాధవరావు తెలిపారు. మండలపరిధిలోని మండపాడు గ్రామంలో భూములు రీసర్వేపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిటీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 60 రోజులలోపు రీ సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్ పులి మాల్యాద్రి రెడ్డి, విఆర్‌ఒ శ్రీనివాసులు, సర్వేయర్ బాలు మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- కొమరోలు

పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిద్దలూరు డివిజన్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి. స్వరూపరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు పొగాకు ఉత్పత్తులు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. విద్యార్థులు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అశ్వనికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు బానిస కాకుండా వాటి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కె.రాజా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ. విశ్వరూపం,మండల ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది.

మద్ది శ్రీనివాసరావు అను నేను ప్రకాశం జిల్లా ఒంగోలు నగరం కొత్తపేటలో కాపురం ఉంటున్నాను. నా తల్లి మద్ది సబ్బుత్నమ్మ గారి పేరుతో ఒంగోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెంబర్ 3744/1989 గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. నేను మా ఇంటి వద్ద నుండి తేది 30-05-2023 న ఉదయం కోర్టు సెంటర్ వద్ద గల జెరాక్స్ షాపుకి వచ్చి జిరాక్స్ తీయించుకొనుటకు చూసుకొనగ ఒరిజినల్ డాక్యుమెంట్ కనపడలేదు చుట్టుపక్కల వెతికినను దొరకలేదు. ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికిన వారు ఈ క్రింది చిరునామా గాని ఫోన్ నెంబర్ గాని తెలియపరచవలసిందిగా కోరుచున్నాను

ఇట్లు
మద్ది శ్రీనివాసరావు S/o కోటయ్య,
OPP. ధీరజ్ హాస్పిటల్,
రంగరాయుడు చెరువు దగ్గర, ఒంగోలు.
ఫోన్ నెంబర్ 9440260028

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి

రూ.7లక్షల పరిహారం

ప్రజాశక్తి-పొదిలి

మండల పరిధిలోని ఈగలపాడు గ్రామంలో గత ఏడాది డిసెంబర్ 21న అప్పుల బాధతో మేడం యలమందారెడ్డి అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు ఎఐ, తహశీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో కూడిన త్రిమెన్ కమిటీ సమగ్ర విచారణ అనంతరం నివేదికను కనిగిరి ఆర్‌డిఒకు పంపారు. ఈ నివేదికపై కనిగిరి ఆర్‌డిఒ, దర్శి ఎడిఎ, డిఎస్‌పి మరోసారి విచారణ జరిపి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. అందులో భాగంగా ప్రభుత్వం బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.7 లక్షలు మంజూరు చేసింది. మృతుడి భార్య ధనలక్ష్మి బ్యాంకు ఖాతాలో నగదును జమ చేసింది. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి సంబంధిత పత్రాలను ధనలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎఒ జైనులాబ్దిన్, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, పేరం కోదండ రామిరెడ్డి, మాదాలవారిపాలెం పిఎసిఎస్ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మరెడ్డి, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

CHANGE OF NAME

I,DWARASILA SISINDRI
S/o. VENKATA REDDY(Old Name)
resident of D.No.4-130, Pathapadu Village, Kanigiri Mandal, Prakasam Dist, Andhra Pradesh,
I have change my name from
DWARASILA SISINDRI to
DWARASILA SHASHINDHAR REDDY
S/o.VENKATA REDDY(New Name)
Hence forth i will be know as
DWARASILA SHASHINDHAR REDDY
will be applicabul for all purpose

పేపరు ప్రకటన కొరకు

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 11/2020
బయ్యపురెడ్డి సురేంద్రబాబు .... వాది
vs
బోడెపూడి రమేష్‌బాబు .... ప్రతివాది
To
ప్రతివాది: బోడెపూడి రమేష్‌బాబు, 36 సం॥లు, తండ్రి: రామారావు, హిందూ, వ్యాపారం, ఆర్/ఒ: 2వ లైన్, మంజునాధ్ వెంచర్, గాంధినగర్, దరిశి గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా.
పై నెంబరు దావాలో దావా మొత్తమును రాబట్టుటకై వాది మీపై దావా దాఖలు చేయగా ప్రతివాదియైన మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపినను మీరు తీసుకొనక త్రిప్పిపంపుట వలన శ్రీకోర్టు వారు పై దావాను మీ హాజరు నిమిత్తం ది. 15-06-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని పై కోర్టులో ఉదయం గం. 10.30 ని॥లకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమందు పై దావాలో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా: 15-06-2023,
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులతో)
దరిశి, ది: 02-06-2023
గువ్వల శ్రీనివాసులరెడ్డి, వాది తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా, సెల్: 93469 17985

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, ప్రస్తుతం ఒంగోలు మున్సిపాలిటీలోకి చేరిన పేర్నమిట్ట గ్రామ నివాసి శ్రీరాముల రామయ్యగారి కుమారుడు శ్రీరాముల పూర్ణయ్య గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ భార్య అయిన శ్రీరాముల లక్ష్మీకాంతం గారికి పూర్వీకుల ద్వారా సంక్రమించబడి వారు నా క్లయింట్ పేరు మీద ఒక గిఫ్ట్ సెటిల్మెంట్ దస్తావేదును వ్రాయించి సంతనూతలపాడు సబ్‌రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేదు నెంబర్ 2047/2022 ద్వారా నా క్లయింట్‌కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కుభుక్తములు కలిగియున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని 'కెన్‌ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఒంగోలు వారి వద్ద తనకా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్తి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యంతరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేదులతో ఈ నోటీసు ప్రకటించిన 7(ఏడు) దినములలోపు, ఈ క్రింది సంతకందారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఋణము తీసుకొనగలరు గడువు తరువాత వచ్చు అభ్యంతరాలును మా క్లయింట్ గాని ఋణదాతను కానీ సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయటమైనది.
షెడ్యూల్: ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రేషన్ ఇలాకా, సంతనూతలపాడు రెవిన్యూ మండలం, ప్రస్తుతం ఒంగోలు మున్సిపాలిటీలో చేరిన పేర్నమిట్ట గ్రామ సర్వే నెం. 452/19 డోర్ నెం. 12-108-2, అసెస్మెంట్ నెంబర్: 1035065557 ఆర్‌సిసి గృహము, స్థలంకు హద్దులు: తూర్పు: రోడ్, పడమర: ఇతరుల స్థలం, ఉత్తరం: దారుకుమల్లి లక్ష్మీకాంతమ్మ గారి గృహం, దక్షిణం: గొంగింటి శ్రీనివాసరెడ్డి గృహం, ఈ హద్దులలో 121 చ.గ. లేదా 1089 చ.అ.గా గల ఖాళీస్థలము అందులో నిర్మించివున్న 1089 చ.గ. గా గల డాబాకు సంబంధించి రాకపోకలు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.
శిఖాకొల్లి రమేష్, న్యాయవాది,
ఎ-బ్లాక్, 4వ ఫ్లోర్, షాప్ నెం. 5(ఎ) గుప్తాస్ స్క్వేర్, 60 ఫీట్స్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఫోన్: 99491 36259

రామాపురంలో పోలీసుల జల్లెడ

ఘర్షణకు పాల్పడిన వారిని గుర్తిస్తున్న పోలీసులు ● పోలీసుల అదుపులో 60 మందికి పైగానే గ్రామస్తులు ● క్షతగాత్రులను పరామర్శించిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి-వేటపాలెం

రామాపురంలో ఘర్షణకు కారకులను పోలీసులు గుర్తించే పనిలో పడ్డారు. ఇరు వర్గాలూ తమలో తాము కొట్టుకోవడంతో పాటు పోలీసులపై కూడా దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసింది. గాయపడిన పోలీసులు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం నిందితుల కోసం గ్రామంలో రాత్రంతా జల్లెడపట్టారు. ఈ సందర్భంగా సముద్రతీర ప్రాంత గ్రామాలతో పాటు అనుమానాస్పద ప్రాంతాలను ఒకటి వదలకుండా పోలీసులు తీవ్రంగా గాలించారు. రేపల్లె సబ్ డివిజన్ పోలీసులు 50 మంది ఒక్కసారిగా రామాపురానికి చేరుకున్నారు. వేటపాలెం మండలం రామాపురం గ్రామంలో ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరిన విషయం పాఠకులకు విదితమే. రామాపురంలోని ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన చీరాల రూరల్ సిఐ ఏ మల్లికార్జునరావు ప్రాథమిక చికిత్స అనంతరం నిందితులను గుర్తించేందుకు రాత్రంతా తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు.

పోలీసుల గాలింపు చర్యలను పసిగట్టిన కొంతమంది గ్రామస్తులు భయంతో ఇళ్లకు తాళాలు వేసుకొని పారిపోయారు. దాదాపు 60 మందికి పైగానే గ్రామస్తులను

చీరాల ఏరియా వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కరణం వెంకటేష్ బాబు

పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వాసనీయవర్గాల సమాచారం. ఈ ఘర్షణలో తీవ్ర గాయాల పాలైన 15 మంది గ్రామస్తులను చీరాల వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు, డిఎస్పి ఎస్ ప్రసాదరావులు బాధితులను పరామర్శించారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల దాకా ఈ ఘర్షణలు కొనసాగుతాయా? పోలీసులు ఇకనైనా కట్టడి చేయండి. సముద్ర తీర ప్రాంతాలకు వెళితేనే సహజంగా మనసు ఉల్లాసంగా ఉంటుంది అందుకే తీరప్రాంత గ్రామాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చెందేందుకు ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పక్క రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడి వాతావరణాన్ని ఇష్టపడి సేదతీరేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, ఐజీలు, సైతం సేద తీరేందుకు వస్తూ ఉంటారు. అంతటి ప్రత్యేకత ఉన్న ఈ గ్రామాలలోకి 2019 అసెంబ్లీ ఎన్నికలలో ప్రధాన పార్టీల ప్రత్యర్థులు గ్రామాలలోని ఓట్లను బహిరంగ ఆయా గ్రామాల పెద్దలతో చర్చలు నడిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఓట్లు పడని గ్రామాలపై రాజకీయ క్రీడ మొదలుపెట్టారు. అందులో భాగంగానే మొదలైన రామాపురం, కటారిపాలెం గ్రామాలలోని వివాదాలు మరో 11 నెలల్లో 2024 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నప్పటికీ ఈ ఘర్షణలు చల్లారలేదు తరచూ గ్రామాలలో నెత్తురు మరకలు అంటుతూనే ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ పర్యవేక్షించాల్సిన పోలీసుల సాచివేత ధోరణి వలనే ఆయా గ్రామాలలో గొడవలకు కారణం అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు కలగజేసుకొని రెండు గ్రామాలలో ఉన్న ఘర్షణ వాతావరణం రామాపురంలో ఉన్న వర్గ విభేదాలను రూపుమాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

రమేష్ రాంజీకి అభుదయ అంత

జైభీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా దోవా రమేష్ రాంజీ

ప్రజాశక్తి-రేపల్లె: జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా ప్రస్తుతం ఆ పార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న న్యాయవాది దోవా రమేష్ రాంజీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ న్యాయమూర్తి హైకోర్టు అడ్వకేట్ జడ శ్రావణ్ కుమార్ నుంచి బుధవారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధినేత మరియు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడికొండ జయ కుమార్ బాపట్ల జిల్లా బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, న్యాయవాదులు ఆయనను అభినందించారు.

మూలగుంటపాడులో పట్టపగలు చోరీ

20 సవర్లు బంగారం, 10 కేజీల వెండి ● పరిశీలించిన పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడులో గురువారం దొంగలు పట్టపగలు ఇంటి తలుపు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బంగారం, వెండిని దోచుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి చెవుల రాజచంద్రశేఖర్ అతని భార్య లక్ష్మి వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగలేక పోవడంతో నెల్లూరుకు వెళ్లారు. నెల్లూరు నుంచి తిరిగి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో సామాను చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఏఎస్ఐ మహబూబ్ బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెనుక వైపు డోరు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి రెండు బెడ్ రూమ్‌లో బీరువాలు పగలగొట్టి, బీరువాల్లో ఉన్న 20 సవర్ల బంగారం, 10 కేజీల వెండి, 15 వేల రూపాయల నగదును తీసుకువెళ్లినట్లు చంద్రశేఖరు కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. పట్టపగలు నిత్యం జనం ఉండే ప్రాంతంలో మూలగుంటపాడులో దొంగతనం జరగడంతో చుట్టుపక్కల నివాసముండేవారు భయభ్రాంతులకు గురయ్యారు. బంగారం విలువ రూ.9 లక్షల వరకూ ఉంటుందని, వెండి రూ.7 లక్షల రూపాయల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి చంద్రశేఖర్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

వేసవి సెలవుల్లో సరదా కోసం

ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి

పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవి సెలవుల్లో పిల్లలు సరదాగా కాలువలు, బావులు, చెరువులు, సముద్ర తీరానికి వెళుతూ ప్రమాదాలకు లోనవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రచార చిత్రాలతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలు కాలువలు, బావులు, చెరువులలో ఈతకు దిగినప్పుడు, మరియు సముద్ర తీరాలలోకి మునిగేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు మనం నిత్యం చూస్తూనే ఉంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాష్ట్రంలో సరాసరి సంవత్సరానికి 1500 మంది ఈత సరదాకు బలవుతున్నారన్నారు. కనుక పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. వారు స్నేహితులతో ఎక్కడికి వెళుతున్నారనే విషయం తెలుసుకోవాలన్నారు. పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులకు ఈత రాకపోతే కలిగే ప్రమాదాల గురించి వివరించాలన్నారు. తల్లిదండ్రులే స్వయంగా వారి పిల్లలను

వెంటబెట్టుకుని వెళ్లి దగ్గరుండి ఈత నేర్పించాలని సూచించారు. ఈత రానివారు స్నేహితులతో బావులు, కాలువలు, చెరువులు, కుంటలలో ఈతకు వెళితే వాటి లోతు తెలియని కారణంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. బావులు, కాలువలు, చెరువులు, కుంటలలో ఈత కొట్టేముందు ఈత వచ్చిన వాళ్లు సైతం వాటి లోతు ఎంత అనే విషయం కర్రల సాయంతో చూసుకోవాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు విహార యాత్రలకు వెళ్లిన సమయంలో ఎక్కువ లోతులోకి వెళ్లకుండా పోలీస్ వారు సూచించిన నిర్దిష్ట లోతులోనే మునగాలన్నారు. మద్యం మత్తులో నీటిలోకి దిగే ప్రయత్నం చేయటం మంచిది కాదని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెరువులు, నీటి కుంటల వద్దకు ఈతకు వెళ్లకుండా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర తీరాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. లోతును తెలిపే విధంగా నిర్దిష్ట లోతులో కర్రలను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తెలియచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

పోలీసుల అదుపులో జూదరులు

జూదరులు అరెస్ట్

రూ.61,000 నగదు స్వాధీనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం శానంపూడి పొలాల్లో గురువారం పేకాట ఆడుతున్న 12 మంది జూదరులను సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెబ్ ఎస్ఐ దయాకర్ చెప్పిన వివరాల ప్రకారం. 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేయగా వారి వద్ద నుంచి 61,110 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసినవారిని శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమాకు పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందని తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం గంగంపల్లిలో సుధాకర్‌రెడ్డి(38) అనే ఆర్మీ ఉద్యోగి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని స్వగ్రామం అదే మండలం సోమిదేవిపల్లి కాగా అత్తగారిల్లు గంగంపల్లికి కుటుంబ సభ్యులతో వచ్చి ఉన్నారు. మృతుడు సుధాకర్‌రెడ్డి 15 సంవత్సరాలుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో పని చేస్తూ నెల సెలవుపై ఇంటికి వచ్చారు. ఈ సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

ప్రజాశక్తి-పామూరు

మృతుడు కిరణ్

పామూరు మండలం, తూర్పుకట్ట కిందపల్లి గ్రామానికి చెందిన కోవూరు కిరణ్(36) అనే వ్యక్తి గురువారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కోవూరు కిరణ్, అదేగ్రామానికి చెందిన నీరుకట్టు సత్యం నూతన ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా దర్వాజా గోడను మిషన్‌తో కట్ చేస్తుండగా మిషన్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు మతుడు కిరణ్ ఎడమ మోకాలు మీద పడటంతో కాలు నరం తెగిపోయి అధికంగా రక్తం పోయింది. వెంటనే కిరణ్‌ను వైద్యం కోసం ఆటోలో పామూరు హాస్పిటల్‌కు తీసుకొనిరాగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని తండ్రి కోవూరు కోటయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేష్ యాదవ్ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి-చిన్నగంజాం

మద్యం మత్తులో అన్నపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నిందితుడిని ఎస్ఐ కే సురేష్ అరెస్టు చేసి చీరాల కోర్టుకు హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని సోపురాల గ్రామానికి చెందిన గోగన నాగరాజు మద్యానికి బానిసై అనవసరంగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో అతని తమ్ముడు గోగన శివశంకర్ అన్నను హెచ్చరించి మందలించాడు. దీని మనసులో పెట్టుకున్న నాగరాజు గత నెల 10వ తేదీ రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఉన్న తన తమ్ముడు శివశంకర్‌ని రాడ్ తీసుకొని ముఖము, చెవి చేతుల మీద తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం శంకర్‌ని ఒంగోలు రూమ్స్‌కు తరలించారు. కేసును నమోదు చేసుకున్న ఎస్ఐ కే సురేష్ ముద్దాయి నాగరాజును అరెస్ట్ చేసి చీరాల కోర్టుకు హాజరు పరచగా ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

అద్దంకి కమిషనర్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పురపాలక సంఘం కమిషనర్‌గా బి శ్రీనివాసులు నియమితులయ్యారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాలు ఉత్తర్వుల మేరకు బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న టి రవికుమార్‌ను బదిలీ చేశారు. శ్రీనివాసులు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర బిసి సెల్ నాయకులు దివి రాంబాబు

తెలుగుదేశం పార్టీతోనే బిసిలకు గుర్తింపు

ప్రజాశక్తి-రేపల్లె

తెలుగుదేశం పార్టీలోనే బిసిలకు గుర్తింపు ఉందని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వల్లే రాష్ట్రంలో బిసిలకు గుర్తింపు వచ్చిందని అన్నారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించటంవలన అనేక మంది బిసిలు రాజ్యాధికారం పొందారని చెప్పారు. ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా, జిల్లా పరిషత్, మండల పరిషత్ చైర్మన్లుగా మున్సిపల్ చైర్మన్లుగా ఎంపిటిసి, జడ్పిటిసి, కార్పొరేటర్లుగా, సర్పంచ్, కార్పొరేటర్లుగా వేలాది మంది ఎన్నికైన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం నుంచి బిసిలను వేరుచేసే కుట్రలు చేస్తూ రాష్ట్రంలో 620 మందిపై దాడులు చేశారని అన్నారు. తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర కూడా ఉన్నారని తెలిపారు. అనేకమంది బిసి నాయకులను హతమార్చారని వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహానాడులో అందరికీ లబ్ధి చేకూరేలా ప్రవేశ పెట్టిన ముందస్తు మానిఫెస్టోలో బిసిల రక్షణ కోసం ఒక చట్టం తీసుకొస్తామని ప్రకటించటం అభినందనీయం అన్నారు. బిసిల రక్షణ చట్టం గురించి వాడవాడల ప్రచారం చేసేందుకు త్వరలో ప్రణాళికాబద్ధంగా అన్నిగ్రామాలలో పర్యటిస్తామని తెలిపారు. సమావేశంలో పద్మశాలి సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు తాడిపర్తి మల్లిఖార్జునరావు, వడ్డెర సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు గోపిరాజు, ఇతర బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పదిలో ప్రతిభావంతులను సత్కరించిన రోటరీ

ప్రజాశక్తి-చీరాల

విద్యారంగంలో ఉత్తమ ప్రతిభావంతులను గుర్తిస్తూ వాళ్లకు చేయూతను అందించడంలోనూ, సేవా కార్యక్రమాలలోనూ రోటరీ క్లబ్ అన్ని వేళలా ముందుంటుందని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాబురావు అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను రోటరీ క్లబ్ ప్రతినిధులు స్థానిక రోటరీ కమిటీ హాల్‌లో సత్కరించి చేయూతను అందించారు. విజయనగర కాలనీకి చెందిన వంటరి ప్రవళిక పెరిరాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతూ 10వ తరగతి పరీక్షలలో 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించింది. పట్టణంలోని మునిసిపల్ గరల్స్ హైస్కూల్ బాలిక 584 మార్కులు సాధించిన బసవ భావనలను శాలువాలతో ఘన సన్మానం చేసి, సర్టిఫికెట్స్, నగదు బహుమతులు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వలివేటి మురళీకృష్ణ, గుర్రం రాఘవరావు, డివి సురేష్, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోలుదాసు రామకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, డి హేమంత్ కుమార్, సత్యనారాయణ, సుభాషిణి, లలితకుమారి, నళిని, లక్ష్మి, రోటరీ, ఇన్నర్ వీల్ ప్రతినిధులు, టీచర్స్ పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల

తమను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీలో గత 30 రోజులుగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా, సమస్యను పరిష్కరించని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం బాపట్లలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ దేశానికి ఎన్నో పతకాలు సాధించిన మల్లయోధుల పట్ల కేంద్ర ప్రభుత్వం మరింత మోసపూరితంగా వ్యవహరి స్తోందని అన్నారు. తమను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని 30 రోజులకు పైగా ఆందోళన చేస్తున్నా నేటికీ వారిపై చర్యలు చేపట్టలేదని అన్నారు. ఆందోళన చేస్తున్న క్రీడాకారులపై పోలీసులు దాడి చేసి శిబిరాన్ని తొలగించడాన్ని, సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. విజ్ఞులైన మేధావులు ప్రజలు కేంద్ర ప్రభుత్వ చర్యను ఖండించాలన్నారు. మల్లయోధులకు మద్దతు తెలపాలని కోరారు. లైంగిక వేధింపులకు బాధ్యుడైన బిజెపి ఎంపీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి జె శామ్యూల్ పాల్గొన్నారు.

రేపల్లె: మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకి పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో రేపల్లె జూనియర్ కాలేజీ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ 50 రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్

బాపట్లలో మాట్లాడుతున్న మజుందార్

రేపల్లెలో సిఐటియు నాయకుల నిరసన

భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళ మల్లయోధులు పోరాడుతున్నారని, 38 కేసుల్లో హత్య, కిడ్నాప్, అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, మోడీ ప్రభుత్వం కాపాడుతూ దేశానికి ప్రతిష్ట తెచ్చిన మహిళా రెజ్లర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి అధ్యక్షుడిగా ఉన్న బిజెపి ఎంపీ తన కుటుంబ పరివారాన్ని మొత్తం రెజ్లింగ్ ఫెడరేషన్‌లో ఉన్నత స్థానాల్లో నియమించి తన కనుసన్నల్లో రెజ్లింగ్ ఫెడరేషన్ నడిచేలా ఏర్పాటులు చేసుకున్నాడని విమర్శించారు. ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య పోరాడుతున్న మల్లయోధులకు మద్దతు తెలియజేస్తూ తక్షణం రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎన్నికలు తక్షణం నిర్వహించని పక్షంలో ప్రపంచ పోటీల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరిక చేయడాన్ని గుర్తుచేశారు. మహిళా రెజ్లర్లు సాధించిన పథకాలను చూసి మురిసిపోయిన భారతీయులందరూ కూడా ఆ మహిళా రెజ్లర్లు ఎదుర్కొన్న లైంగిక వేధింపుల బాధను కూడా అర్థం చేసుకోని వారికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తమ జీవితాంతం కష్టపడి సాధించిన మెడల్స్‌ను సైతం గంగా నదిలో కలపాలని రెజ్లర్లు తీసుకుని నిర్ణయం పట్ల కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం మహిళల పట్ల, లైంగిక వేధింపులు పట్ల ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనుధర్మ శాస్త్రం ప్రకారం బిజెపి ప్రభుత్వం పరిపాలిస్తుందనడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, మోడీ అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక వైఖరితో దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా మంట కలుపుతున్నారని, తక్షణం లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రైతులు కార్మికులు, విద్యార్థులు, రైతు సంఘాలతో కలిసి ఉధృత పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె ఆశీర్వాదం, డి శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరరావు యు రామకృష్ణ ప్రసాద్, వై నవీన్, కె వెంకటేశ్వరరావు, బాబి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి: ఆర్‌డిఓ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలలో పురోగతిని సాధించాలని రేపల్లె ఆర్‌డిఓ పార్థసారథి సూచించారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో మూడు లే ఔట్‌లలో రెండోది కోర్టు పెండింగ్‌లో ఉండగా మిగిలిన వాటిలో దాదాపు 1080 పైగా లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 276 మంది మాత్రమే గృహాల పనులు ప్రారంభించారని, మిగిలిన వారు ఎందుకు ప్రారంభించలేదని ఆర్‌డిఓ

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఓ పార్థసారథి

ప్రశ్నించారు. అందుకు కలిగే ఇబ్బందులు, అందాల్సిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. రహదార్లు, నిర్మాణానికి అవసరమైన నీరు, బిల్లులు సకాలంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణం ప్రారంభించుకొనే విధంగా మండల స్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన గ్రామాలలో కూడా నిర్మాణాల పరిస్థితిని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో తీసుకున్న టార్గెట్ పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎంఎల్ శ్రావణ్ కుమార్, హౌసింగ్ ఏఇ సౌమ్య, పిఆర్ ఏఇ రామచంద్రరావు, విఆర్‌ఓలు శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

నెరవేరని సొంతింటి కల

అసంపూర్తిగా బహుళ అంతస్తు భవన నిర్మాణం ● నేటికీ లబ్ధిదారులకు అందని గృహాలు

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె పట్టణ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల కలగానే మిగులుతోంది. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన బహుళ అంతస్తు భవన నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. పట్టణ ప్రాంత పేదప్రజల సొంతింటి కలను నిజం చేసే లక్ష్యంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన టిడ్కో గృహ నిర్మాణాలు.. రేపల్లె పట్టణంలో లబ్ధిదారులకు తీరని వేదన కలిగిస్తున్నాయి. టిడ్కో గృహం మజూరైన కారణంగా 18వ వార్డులో నివేశన స్థలాలు దక్కలేదు. దీంతో చాలీచాలని గుడిసెల్లో, అద్దె ఇళ్లలో నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని మురికి వాడల్లో నివసించే పేదలకు సౌకర్యాలతో కూడిన బహుళ అంతస్తు భవనాలు నిర్మించి ఇవ్వాలని గత ప్రభుత్వం యోచించింది. 28 వార్డుల్లో ఇళ్లు లేని 1,344 మంది పేదలను పురపాలక సంఘ అధికారులు గుర్తించారు. ఇళ్ల నిర్మాణానికి పట్టణ శివారులో స్థలం కొన్నారు. లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు కూడా అందజేసి పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. టీడీపీ హయాంలో పనులు శరవేగంగా సాగాయి. ఆ తర్వాత 2019లో వచ్చిన

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం అటకెక్కింది. ఆ తరువాత బిల్లులు సక్రమంగా మంజూరు కాలేదు. దీంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నాలుగేళ్లయినా భవన నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఎప్పుడు చేపడతారో తెలియక లబ్ధిదారుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. నిర్మాణాల్లోని ఇనుప చువ్వలు తుప్పుపడుతున్నాయి.

అద్దె ఇళ్లలో అవస్థలు

టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. సొంతింటి కల నెరవేరుతుందన్న వారి ఆశలు రోజురోజుకూ నిరాశలవుతున్నాయి. ఓవైపు కూలి పనులు దొరకక, పిల్లలను చదివించుకోలేక నానా అవస్థలు పడుతుంటే.. మరోవైపు ఇంటి అద్దెను చెల్లించలేక అప్పుల మీద అప్పులు చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం త్వరగా టిడ్కో ఇళ్లను నిర్మించి.. లబ్ధిదారులకు అందిస్తే.. వచ్చిన కూలి డబ్బులతో తమ కుటుంబాలను పోషించుకుంటామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి.. గత ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తైన టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి.. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలని.. బాపట్ల జిల్లా రేపల్లె లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రెయినేజీ స్థలం 'కబ్జా'

- కార్పొరేషన్ పాలక పెద్దల హస్తం...?
- పాత కాలువను కప్పేసి పైప్‌లు ఏర్పాటు చేసిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

కబ్జాకు గురైన డ్రెయినేజీ స్థలం

కబ్జాకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన పైపులైన్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వాగులు, వంకలు, డొంకలు, కుంటలను సైతం వదల కుండా ఆక్రమణలకు పాల్పడుతూ తరచూ అప్రతిష్టపాలవుతున్న వైసిపి నాయకులు తాజాగా ఏకంగా కార్పొరేషన్ డ్రెయినేజీ స్థలాన్నే కబ్జా చేశారు. పాత మురుగు కాలువను కప్పేసి కబ్జాకు పాల్పడ్డారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు పాత కాలువ స్థానంలో వారే సొంతంగా పైప్‌లు కూడా ఏర్పాటు చేశారు. తాజాగా ఆప్రాంతంలో కొత్త డ్రెయిన్ కట్టేందుకు టెండర్లు పిలిచారు. అయితే ఆస్థలం కబ్జాకు గురైందని తెలిసి అధికారులు నివ్వెరపోయారు. కబ్జాచేసిన వారిలో కార్పొరేషన్ పాలక పెద్దలు ఉన్నారని తెలిసి ఏం చేయాలో పాలుపోక గప్‌చుప్‌గా ఉన్నారు.

ఒంగోలు నగరంలోని మామిడిపాలెం రెడ్డి హాస్టల్ నుంచి వెంగముక్కపాలెం బైపాస్ జంక్షన్ వరకూ పాత డ్రెయినేజీ ఉంది.మామిడిపాలెం, గద్దలగుంట ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు నీరు వెళ్లి బైపాస్ వద్ద ఉన్న భారీ డ్రెయిన్‌లో కలుస్తోంది. రెడ్డి హాస్టల్ వెనుక వైపున కొంత భాగం పాత డ్రెయినేజీ ఇప్పటికీ సజీవంగానే ఉంది. కొంతభాగం డ్రెయినేజీని మాత్రం కబ్జా దారులు కాజేశారు. పనిలో పనిగా పక్కనే ఉన్న ఓ ప్రయివేటు వ్యక్తి స్థలాన్ని కూడా కొంత ఆక్రమించారని తెలిసింది. ఈ ప్రయివేటు వ్యక్తి స్థలం విషయాన్ని సెటిల్‌మెంట్ చేసేందుకు కొంతమంది అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగినట్లు సమాచారం.

పాత కాలం నాటి డ్రెయినేజీలో నీరు సక్రమంగా పోవడం లేదు. సామర్థ్యం చాలడం లేదని భావించిన కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆప్రాంతంలో సామర్థ్యం పెంచి కొత్తగా డ్రెయినేజీ నిర్మించాలని తలచారు. అందు కోసం టెండర్లు కూడా పిలిచారు. కాంట్రాక్టర్‌తో వర్క అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. తీరా డ్రెయినేజీ కట్టాల్సిన ప్రాంతంలో కీలకమైన స్థలం కబ్జాకు గురైందని తెలిసి పనులు చేయించకుండా ఆపేశారు.

కార్పొరేషన్ డ్రెయినేజీ స్థలాన్ని కబ్జా వెనుక కార్పొరేషన్ పాలక వర్గ పెద్దల హస్తం ఉన్నట్లు తెలిసింది. వారే వారి అనుయాయుల చేత స్థలాన్ని కబ్జాచేయించి అక్కడ షాపులు, ఇల్లు ఏర్పాటు చేసేలా పథక రచన చేశారని సమాచారం. ఇందుకోసం నకిల పట్టాలను సృష్టించి తమ వద్ద పట్టాలు ఉన్నాయని బుకాయిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్‌లో మురుగుపారే డ్రెయినేజీకి పట్టాలు ఇచ్చిన ఘనులెవరన్నది చూడాల్సి ఉంది.స్థలాన్ని కాజేసేందుకు ఆక్రమణదారులు తమ వద్ద పట్టాలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కార్పొరేషన్ స్థలాలు ఆక్రమణలకు గురైతే కాపాడాల్సిన పాలక వర్గ పెద్దలే స్థలాలను కాజేస్తూ కార్పొరేషన్ పరువు, ప్రతిష్టలను మంటగలుపుతున్నారని అధికార పార్టీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లే విమర్శిస్తున్నారు. కాలువ కట్టేందుకు టెండర్లు పిలిచిన స్థలం కబ్జాకు గురైందని తెలిసి కూడా కార్పొరేషన్ ఉన్నతాధికారులు కనీసం కబ్జాకు గురైన వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఆక్రమిత స్థలంలో హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకోక పోవడం శోచనీయం.

చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

చిన్నారికి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడుకు చెందిన వైసిపి కార్యకర్తల మానేపల్లి వరకుమార్ కుమార్తె పుష్పాలంకరణ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల అనార్యోగానికి గురైన మండల పరిధిలోని పడమర వీరాయపాలెం మాజీ సర్పంచి రావిపాటి శ్రీనివాసులును పరామ ర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, మాజీ ఎంపిపి వీరగంధం కోటయ్య, వైసిపి మండల నాయకులు నుసుం ప్రతాపరెడ్డి, నుసుం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున బూచేపల్లి వెంకాయమ్మ

వివాహ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని పిజిఎన్ కల్యాణ మండపంలో వైసిపి నాయకుడు, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సద్దిపుల్లారెడ్డి కుమార్తె డాక్టరు తేజస్వి, డాక్టరు మల్లారెడ్డి వివాహవేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కెవిరెడ్డి, మాజీ ఎంపిపిలు వీరగంధం కోటయ్య, మధుసూధనరెడ్డి, ఇత్తడి దేవదానం, కాకర్ల కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కీసరి రాంభూపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - గిద్దలూరు

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. పై చదువుతులు కూడా క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులను సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు భారతి, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దొనకొండ : పదోతరగతి పరీక్షల్లో 560/600 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న స్థానిక బీసీ వసతి గృహ విద్యార్థి వరుణ్‌నందన్‌ను గురువారం సన్మానించారు. ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ చేతుల మీదుగా వరుణ్ నందన్‌ను అభినందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ వసతి గృహంలో ఉంటూ చదువు కొని ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం వరుణ్ నందన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలపు ప్రభుదాసు, మల్లెల ఆనంద్‌కుమార్, వరుణ్ నందన్ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిపాడు లో డ్రైవర్స్ డే

ప్రజాశక్తి - మద్దిపాడు

ఆటో యూనియన్ మండల కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం డ్రైవర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎండి. బేగ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. దీంతో కార్మికులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఆటో డ్రైవర్లను సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హుసేన్, రవి, ఠాగూర్, వెంకటేశ్వర్లు, ఉమేష్. ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-దర్శి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మార్కెట్ కమిటీ ఎపి ఔట్‌సోర్సింగ్ కోశాధికారి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సమస్యలను వెంటనే పరిష్కరిం చాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-మద్దిపాడు

మహిళా రెజ్లర్లకు మద్దతుగా సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం బిజెపి ఎంపీ బ్రిజ్ భూషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. మాబు మాట్లాడుతూ నెల రోజులుగా ఢిల్లీలో మహిళా రెజ్లర్లు ఆందోళనలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. క్రీడల్లో రెజ్లర్లకు వచ్చిన మెడల్స్‌ను సైతం వారు గంగానదిలో వేయడానికి సిద్ధపడ్డారని తెలిపారు. దీన్ని బట్టి పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. అనంతరం ఎంపీ బ్రిజూ భూషన్ దిష్టి బొమ్మకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు నిప్పు అంటించారు. రెజ్లర్లకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయంతిబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతురావు, సిఐటియు మండల అధ్యక్షుడు కాసిం, ఐద్వా మండల అధ్యక్షురాలు అనంతలక్ష్మి, నాగులుప్పలపాడు మండల కౌలు రైతు సంఘం నాయకులు తాటిబండ్ల యోహాను, మద్దిపాడు మండల సిఐటియు కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, పాలపర్తి యోన, గాదె నాగేశ్వరరావు, చెరుకూరి వాసు, కనపర్తి ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వధూవరులకు ఎమ్మెల్యే గొట్టిపాటి ఆశీర్వాదం

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండల పరిధిలోని తిమ్మన్నపాలెం గ్రామంలో ప్రజాశక్తి కందుకూరు విలేకరి నాదెళ్ల కోటేశ్వరరావు కుమార్తె ఝన్సీరాణి, అనిల్ కుమార్ వివాహ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, టిడిపి కందు కూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, సిపిఎం నెల్లూరు జిల్లా నాయకుడు ముప్పరాజు కోటయ్య, సిపిఎం ప్రకాశం జిల్లా నాయకుడు జివి. కొండారెడ్డి, ప్రజాశక్తి ఒంగోలు బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి. బ్రహ్మం, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి బ్రహ్మయ్య, నెల్లూరు జిల్లా కన్వీనర్ కె.కోటేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూరులను ఆశీర్వదించిన వారిలో టిడిపి కందుకూరు నియోజక వర్గ నాయకులు, కోరిశపాడు మండల టిడిపి నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, బోయపాటి వెంకటేష్, రాజేష్, బ్రహ్మానందం, అన్నంగి దేవసహాయం ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకూ'

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దారవీడు

ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి డాక్టర్ సురేష్ తెలిపారు. మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నవరత్నాల పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాచగొర్ల వెంకట సుశీల, పిచ్చయ్య యాదవ్, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, పుల్లలచెరువు జడ్‌పిటిసి వాగ్యనాయక్, సర్పంచి వెన్నా సంజీవకష్ణారెడ్డి, డివిజనల్ అభివృద్ధి అధికారి సాయికుమార్, ఎంపిడిఒ నాజర్‌రెడ్డి, డిటీ రాజేష్, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసులు, హౌసింగ్ డిఇ సురేష్ బాబు, సర్పంచులు రామాంజనేయరెడ్డి, అవులయ్య యాదవ్, నాగరాజు, ములా వెంకటరమణరెడ్డి, వైసిపి నాయకులు గుండా రెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, గొట్టం వేణుగోపాల్‌రెడ్డి, నందిరెడ్డి రఘునాథ్‌రెడ్డి, వజ్రాల ఆదిరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ ఒద్దుల లక్ష్మిరెడ్డి, వాలంటీర్లు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పొదిలి :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఏలూరు పంచాయతీ పరిధి సల్లూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ప్రజల సమస్యల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ గుజ్జుల రమణా రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, మండల మాజీ కన్వీనర్ గుజ్జుల సంజీవ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు ఎస్‌కె.నూర్జాహన్ బేగం, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ యక్కలి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -జరుగుల్లి

రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత పథకం ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని మేనిపెస్టో ప్రకటించడాన్ని హర్షిస్తూ చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, టిడిపి యూత్ అధ్యక్షుడు ఎనిమిరెడ్డి రమేష్‌రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి, వట్టిగుంట శివాజీ, స్వర్ణా బ్రహ్మయ్య, గుండపనేని వెంకటేశ్వర్లు, బలరామిరెడ్డి పాల్గొన్నారు. **శింగరాయకొండ :** మండల తెలుగు రైతు అధ్యక్షుడు బైరపనేని మోహన్ రావు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిం చారు. అనంతరం కందుకూరులోనున్న నందమూరి తారక రామారావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలవేసి నివాళు లర్పించి. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ ,కూనపురెడ్డి వెంకట సుబ్బారావు , మించల బ్రహ్మయ్య , పులి ప్రసాదు ,పులి మాలకొండయ్య పాల్గొన్నారు. **కొండపి :** రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టో విడుదల చేశారు. ఆ మేనిఫెస్టోను హర్షిస్తూ టిడిపి నాయకుడు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బి.యలమందనాయుడు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నరసారెడ్డి, బత్తుల నారాయణస్వామి, వసంతరావు పాల్గొన్నారు.

వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత

కొనకనమిట్ల : మండలపరిధిలోని పెదారికట్ల గ్రామానికి చెందిన వికలాంగుడు నుసుం అంకయ్యకు వైసిపి వికలాంగుల విభాగం కొనకనమిట్ల మండల అధ్యక్షుడు బాలచంద్రుడు గురువారం వీల్‌చైర్ అందజేశాడు. ఈ సందర్భంగా బాలచంద్రుడు మాట్లాడుతూ అంకయ్యకు షుగర్ వ్యాధి కారణంగా గత 5 సంవత్సరాల క్రితం కాళు తొలిగించినట్లు తెలిపారు. అంకయ్య గురించి వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన గోపాల్‌రెడ్డి దాతల సహకారంతో అంకయ్యకు వీల్‌చైర్ ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంకయ్య దాతలకు అభినందనలు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని మండల పరిధిలోని చిన్న బోయలపల్లి గ్రామానికి చెందిన దగ్గుపాటి మల్లేశ్వరి తహాశీల్దార్ దాసుకు గురువారం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ భాగస్తులలో తన వాటా కోసం 2021లో తాను కోర్టులో పారటేషన్ దావా వేసినట్లు తెలిపారు. కోర్టులో దావ నడుస్తూండగా తమ భాగస్తులలో ఓ వ్యక్తి తనను మోసగించి గురిజేపల్లిలోని గ్రామ సర్వే నెంబర్ 677లోని ఎనిమిది ఎకరాల 14 సెంట్ల భూమిలో దగ్గుపాటి నారాయణ అనే వ్యక్తికి మూడు ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా త్రిపురాంతకంలోని సర్వే నెంబర్ 266/3డిలోని 240 చదరపు గజములు తనకు తెలియకుండా తప్పుడు నివేదికలతో అమ్ముకున్నట్లు తెలిపారు. దీన్ని నిలుపుదల చేయాలని మార్కాపురం కోర్టును తాను ఆశ్రయించినట్లు తెలిపింది. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆన్‌లైన్‌లో వారి పేర్లు తొలగించాలని కోరింది. అనంతరం యర్రగొండపాలెం సబ్ రిజిస్టార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసింది.

గృహ నిర్మాణాలు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- దొనకొండ

జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం హౌసింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిల్లుల సమస్యలు, గృహాల మంజూరులో ఎదురవుతున్న సాంకేతిక లోపాలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం గృహ నిర్మాణంకోసం లబ్ధిదారులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేశారు. అనంతరం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వెంకటేశ్వరు, సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ, వైస్ ఎంపిపి వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, తహశీల్దారు కె.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ వి.వసంతరావు నాయక్, హౌసింగ్ డిఇ నిరీక్షణరావు, నాయకులు కందుల నారపురెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

అధికారులు సమావేశానికి హాజరు కాకపోతే ఎలా?

జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడం సరి కాదని జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రామన మహాలక్ష్మమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు లేకుండా సమస్యల గురించి ఎవరితో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తాతపూడి సుకుమార్, వైస్‌ఎంపిపి తాతపూడి మేరీ పుష్ప, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, నాగూర్ యాదవ్, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దేవసహాయం, సచివాలయ కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, సర్పంచులు సురేష్‌బాబు, శ్యామల కష్ణారెడ్డి, కటికల రిబ్కా, గోన సుదర్శన్, ఎంపిటిసిలు గిద్ద తిరుపతమ్మ, కటకల వెంకటరత్నం, ఎలుక రమణయ్య, గోన జేమ్స్, గంజి రవీంద్రారెడ్డి, పాణ్యం మురళి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్‌పిటిసి తిరుపతి రెడ్డి

'మలేరియా' పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కనిగిరి

మలేరియా జ్వరం పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్, డాక్టర్ ప్రియర్షనంద తెలిపారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని మలేరియా జ్వరంపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలను వినియోగించు కోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. గృహాల చుట్టూ మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయలు ,సూపర్‌వైజర్ బాలుడు, సచివాలయ హెల్త్ సెక్రటరీ లక్ష్మి, ఆశావర్కర్లు, వాలంటీర్లు , వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-కొండపి

రెస్టారెంట్లు, గ్రామాల్లో ఎక్కడైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కనిగిరి డిఎస్‌పి ఆర్.రామారాజు హెచ్చరించారు. కొండపి పోలీసు స్టేషన్ గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డు పరిశీలించారు. అనంరతం కొండపి పట్టణంలోని రెస్టారెంట్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి అనుమతి లేకుండా రెస్టారెంట్లో మద్యం అమ్మితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి సిఐ పాండురంగారావు, ఎస్ఐ వైవి. రమణయ్య , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

76 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, వెంకట కృష్ణాపురం,ముక్కొడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు 903 పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 827 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 76 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర అత్యధిక రూ. రూ.201, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.197.33పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని రాగసముద్రం తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీపట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, జిల్లా మహిళా కన్వీనర్ ఏనుగుల పద్మావతి, జిల్లా సహ కన్వీనర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ అవిసినేని రమణయ్య, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్‌ను నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య పైపులైన్ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని వర్క్ఇన్‌స్పెక్టర్ రెహమాన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల తిరుపతయ్య, రామగిరి, దినకర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ శ్రేయస్సే ధ్యేయం: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వైఎస్ఆర్ రైతుభరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదు పంపిణీ కార్యక్రమం గురువారం స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండలో బటన్ నొక్కి నగదు విడుదల చేసిన కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం నిర్వహించారు. అనంతరం వై.యస్.ఆర్ రైతుభరోసా, ఇన్ పుట్ సబ్సిడీ, పంటల నష్టపరిహారం నగదును చెక్కుల రూపంలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు చేతులమీదుగా రైతులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలోనే వ్యవసాయ అనుబంధ సేవలన్నీ రైతులకు అందించడానికి ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. బహుళ ప్రయోజనార్థం రైతుభరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిష్కరించారన్నారు. నిషేధిత జాబితాలో నుంచి వేలాది ఎకరాల రైతుల భూములకు శాశ్వతంగా విముక్తి కల్పించారని వివరించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాపట్ల జిల్లాలో రైతులు పండిస్తున్న పంటలను ప్రభుత్వం కొనుగోలుచేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అత్యంత వేగంగా జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు నష్టం అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. కేవలం 15 రోజుల్లోనే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటలకు రూ.7.76 కోట్లు పరిహారం నిధులను విడుదల చేసిందన్నారు. గడిచిన నాలుగేళ్లలో రైతులకు సుమారుగా రూ.వెయ్యి కోట్ల నిధులు ఆర్థికసహాయంగా అందించిందన్నారు. ప్రస్తుతం వై.యస్.ఆర్ రైతుభరోసా, పి.ఎం. కిసాన్ కింద లక్షా 82 వేలా 854 మంది రైతులకు రూ.137.14 కోట్లు పంపిణీ చేసిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1.37 కోట్లు నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. జిల్లాలో పంట నష్టపోయిన 2,828 మంది రైతులకు నష్ట పరిహారం కింద రూ.7.76 కోట్లు పరిహారం నిధులు విడుదయ్యాయన్నారు. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ రైతులకు వెన్నంటి ఉంటామని అన్నారు. రైతుల పక్షపాతి ప్రభుత్వంగా ముద్ర వేసుకుందని, ప్రస్తుతం రైతులంతా నిక్షేపంగా ఉన్నారని ఆయన చెప్పారు. విత్తు నుంచి విక్రయం దాకా రైతులు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రైతుభరోసా కేంద్రాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వర్షాలకు తడిచిన పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్ శ్రీధర్, వ్యవసాయ శాఖ జె.డి షేక్ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, ఆర్‌డిఒ జి.రవీందర్, ఏపిఎమ్‌ఐపి పిడి రమణ, ఉద్యానవన శాఖ ఏ.డి జెన్నెమ్మ, రైతులు పాల్గొన్నారు.

రైతుభరోసా, పంటల నష్టపరిహారం నగదు చెక్కుల రూపంలో రైతులకు అందజేస్తున్న జిల్లా కలెక్టరు, ఎమ్మెల్యే రఘుపతి

రైతుల ఆత్మహత్యలపై పిహెచ్‌డి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'వ్యవసాయ రంగ సంక్షోభం-రైతుల ఆత్మహత్యలు' అనే అంశంపై ప్రకాశం, అనంతపురం జిల్లాల్లోని రైతు ఆత్మహత్యలపై జరిపిన పరిశోధనలకు చేనేత నాయకులు మాచర్ల మోహన్‌రావుకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారు పిహెచ్‌డిని ప్రధానం చేశారు. వాణిజ్య, ఆహార పంటలు పండించే రైతులలో జరుగుతున్న ఆత్మహత్య లలో ఎక్కువమంది ఏ విధమైన పంటలు పండించే రైతులు ఆత్మహత్యలకు గురవుతు న్నారు. ఏయే సామాజికవర్గాల రైతులు ఎక్కువగా ఆత్మహత్య లకు పాల్పడుతున్నారు.. అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలో రైతు ఆత్మహత్యలకు, అధిక వడ్డీ రేట్లకు రుణం తీసుకోవడం, వ్యవసాయ పెట్టుబడికి, పండిన దిగుబడి పంటపై వచ్చే ఆదాయం సరిపోక అప్పులు పాలవడం, జాతీయ, గ్రామీణ బ్యాంకులలో పేద రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు ఉన్న కఠిన నిబంధనలు, కౌలు రైతులకు బ్యాంకురుణాలు ఇవ్వకపోవడం, నాసిరకం విత్తనాలు, ఎరువులు,పురుగు మందులు మొదలగునవి రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణం అని పరిశోధనలో వెల్లడైంది. ఒంగోలు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యన్ నిర్మలామణి మోహనరావుకు గైడ్‌గా వ్యవహరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె మధుబాబు ఈ పరిశోధనను ఆమోదించి పిహెచ్‌డి డిగ్రీని ప్రొవిజనల్ సర్టిఫికెట్ ద్వారా ఇచ్చారు.

పిహెచ్‌డి డిగ్రీ తీసుకుంటున్న మాచర్ల మోహన్ రావు

దోమలను నిర్మూలిద్దాం.. ప్రజారోగ్యాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-బాపట్ల

దోమలను సమూలంగా నిర్మూలిస్తేనే ప్రజారోగ్యాన్ని పరిరక్షించగలమని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బాపట్లలో వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రతతోనే దోమలను నిర్మూలించి ప్రజలను జ్వరాల బారి నుంచి రక్షించగలమన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల సమిష్టి సహకారంతో దోమలను తరిమికొట్టే దిశగా కృషి జరుగుతుందన్నారు. జ్వరం లక్షణాలు కనిపించని వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా రక్త పరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్స పొందాలన్నారు. భాగంగా జూన్ 1 నుంచి 30 వరకు అన్ని గ్రామాలలో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలను మలేరియా వ్యాధి పట్ల తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. తొలుత జిల్లా వైద్యారోగ్య అధికారి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై రాజకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, నిర్వహణ అధికారులు, మలేరియా సిబ్బంది, ఎమ్మెల్‌హెచ్‌పిలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న విజయమ్మ

పశు బీమా.. పాడి రైతులకు ధీమా

ప్రజాశక్తి-కొల్లూరు

పాడి రైతులకు ధీమా పశు బీమా అని మండల పశు వైద్యులు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని పశువులు మేకలు, గొర్రెలు వివిధ రకాల వ్యాధులతో మృత్యువాత పడినట్లయితే పరిహారం లభించేవిధంగా ఈ నెల 1వ తేదీ నుంచి ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. జీవాల పోషకులకు ఈ బీమా పథకం మూడేళ్ల పాటు వర్తిస్తుందని, జీవాల పోషకులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో పాడి వ్యవస్థ చిన్నాభిన్నం

గొట్టిపాటి కోటేశ్వరరావు, అలవలపాడు పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు

ప్రజాశక్తి-పంగులూరు

జిల్లా డెయిరీని విచ్ఛిన్నం చేసి, పాడి పరిశ్రమలోకి ప్రవేట్ కేంద్రాలను తీసుకురావడం వలన గ్రామీణ పాల వ్యవస్థ దెబ్బతినిపోయిందని అలవలపాడు పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు గొట్టిపాటి కోటేశ్వరరావు అన్నారు. గురువారం (జూన్ ఒకటో తేదీ) ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా కోటేశ్వరరావు 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. 80వ దశకంలో ఈ ప్రాంతంలో గ్రామీణ పాల వ్యవస్థ పటిష్టంగా తయారైందని, ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ పాల కేంద్రాలు, పాల సేకరణ కొనసాగిస్తూ పాడి పరిశ్రమను ప్రోత్సహించాయన్నారు. తెల్లదోమతో వ్యవసాయ పంటలు మొత్తం సర్వనాశనం అయిపోయి, రైతాంగం అప్పుల ఊబిలో కూరుకొనిపోయిన సమయంలో, రైతాంగానికి పాడి పరిశ్రమ దిక్కు అయ్యిందని, ప్రతి కుటుంబం పాలపై ఆధారపడి జీవించిందని కోటేశ్వరావు చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాల కేంద్రం, దానికి ఒక కార్యవర్గం, దాని పరిపాలన ఉండేదని, పాడికి మంచి ప్రోత్సాహం కూడా ఉండేదని చెప్పారు. అయితే పాడి పరిశ్రమ లోకి ప్రవేటు సంస్థలు అడుగుపెట్టడంతోనే పాడి పరిశ్రమ పతనం మొదలైందని, జిల్లా డెయిరీ నేడు దిక్కులేని పరిస్థితిలో ఉందని అన్నారు. అలవలపాడు పాల కేంద్రానికి తాను రెండుసార్లు అధ్యక్షుడిగా సుమారు 15 సంవత్సరాల పాటు పని చేశానని కోటేశ్వరరావు చెప్పారు. ప్రతిరోజు 22 క్యాన్లు పాలు జిల్లా డెయిరీకి సరఫరా చేసేవారమని, పాడి రైతులకు ఎప్పటికప్పుడు పాల డబ్బులు అందిస్తూ, వారి కష్టసుఖాల్లో కూడా పాలుపంచుకునేవారుమని కోటేశ్వరావు తెలిపారు. తన పదవీకాలంలో పాడి రైతులకు మంచి పాడి గేదెలు సరఫరా చేయటం, కొంత నిధిని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. తరువాత ప్రైవేట్ పాల కేంద్రాలు గ్రామాల్లో ప్రవేశించాయని, ఒక్కొక్కటిగా గ్రామాల్లో చేరి, పాడి వ్యవస్థను నాశనం చేశాయని చెప్పారు. నేడు జిల్లాలో ప్రభుత్వ డెయిరీ ఎక్కడ ఉందో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీసే ప్రయత్నంలో భాగస్వాములు అయ్యాయని, అందువల్లనే ప్రభుత్వ రంగం నిర్వీర్యం అవుతుందని చెప్పారు. తాను అలవలపాడు మైనర్ ఇరిగేషన్ ట్యాంకు అధ్యక్షుడిగా కూడా పని చేసినట్టు చెప్పారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-నిజాంపట్నం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని నిజాంపట్నం శాఖ గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి తెలిపారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని మరింత పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారిని తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తప్పక పంపించాలని ఆమె కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం పనిచేస్తుందని బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి లేబర్ ఆఫీసర్ డివి శివ ప్రసాద్ అన్నారు. గురువారం బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ నెల రోజులు లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లాలోని అధికారులు విస్తత తనిఖీలు చేస్తారని వెల్లడించారు. దుకాణాల్లో, ఫ్యాక్టరీల్లో, సంస్థల్లో కానీ 14 సంవత్సరాల లోపు పిల్లలను పనికి పెట్టుకోరాదన్నారు. 14 నుంచి 18 లోపు వయసు గల పిల్లలను పనిలో పెట్టుకుంటే జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాపట్ల పట్టణంలోని ఒక కూల్‌డ్రింక్ షాపులో బాల కార్మికుడికి గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఏఎల్‌ఓ సాయి జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్ తరపున డి రమేష్, పోలీస్‌ల తరపున నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమృతలూరు

అమృతలూరు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నేడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ వై నాంచారయ్య గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెనాలి నుంచి సప్లై వచ్చే హై లెవెల్ లైన్లో పలుచోట్ల మరమ్మతులు ఉండటం చేత వాటిని శనివారం చేస్తున్నట్లు తెలిపారు. అందువలన మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలందరూ సహకరించాలని ఏఈ నాంచారయ్య కోరారు.

ఆసియా కోకో ఛాంపియన్ షిప్‌లో ప్రథమస్థానం పొందిన శివనాగిరెడ్డిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ఆసియా ఖోఖో పోటీల్లో శివనాగిరెడ్డికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆషియన్ ఖోఖో ఫెడరేషన్ ఆధ్వర్యంలో అస్సాంలో జరిగిన నాలుగో ఆసియా ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని ప్రథమస్థానంలో నిలిచిన అట్ల శివనాగిరెడ్డికి గురువారం కలెక్టర్ రంజిత్‌భాషా గోల్డ్‌మెడల్‌ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని, ప్రభుత్వ పరంగా తగిన సాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎమ్.సీతారామిరెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కెపాల్.కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. ఎంత ఆవేదన చెందితే పోరాడి సాధించుకున్న బంగారు పతకాలు గంగా నదిలో వేయడానికి రెజ్లర్లు సిద్ధపడతారని ప్రశ్నించారు. మహిళా క్రీడాకారుణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని దేశవ్యాప్త జరుగుతున్న నిరసనలో భాగంగా గురువారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో సిఐటియు, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రెజ్లర్లు తమపై లైంగిక దాడులు జరిగాయని, తమకు న్యాయం చేయాలని చేస్తున్న దీక్షలకు ప్రజలందరూ సంఘీభావం తెలపాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రెజ్లర్లపై లైంగిక దాడుల ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో న్యాయవిచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర నాయకులు శ్రీరామశ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులు, చట్టాలు హరించడంతో పాటు ప్రజల మధ్య మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమానికి సిఐటియు నగర నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు కె.అంజమ్మ, పి.జయమ్మ, సిహెచ్.మార్తమ్మ, పి.రమణమ్మ పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి మూలం సైన్స్

- జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు ఎవి.పుల్లారావు
- సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమాజ ప్రగతికి మూలం సైన్స్ అని, శాస్త్రీయ దక్పథం మాత్రమే సమకాలీన ఆర్థిక, సామాజిక, సాంకేతిక సమస్యలకు పరిష్కారం చూపగలదని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.వి.పుల్లారావు అన్నారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జెవివి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజాహుస్సేన్ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో జెవివి సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏవి పుల్లారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు అంగీకరించిన డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల నుండి తొలగించడం వంటి చర్యలతో విద్యార్థులు పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వం, పరిశోధనల పట్ల ఆసక్తి కోల్పోతారన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జెవివి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కుర్రా రామారావు, కె.సుబ్రహ్మణ్యాచారి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ సమాజ నిర్మాణం లక్ష్యంగా 35 సంవత్సరాల క్రితం ఏర్పడిందని, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం చేస్తున్న కృషిలో భాగస్వాములు కావాలని కోరారు. ఉన్నత పాఠశాల విద్యార్థులలో సజనాత్మక శక్తిని, ప్రశ్నించేతత్వాన్ని, పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ మాసపత్రిక వెలువరిస్తున్నామని, సంవత్సర చందా రూ.300 చెల్లించి చందాదారులుగా చేరాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.జయప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో ఈ నెల 1 నుండి 30 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డాక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యావంతులు.. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు వి.మాలకొండారెడ్డి, కె.నారాయణ, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ఎమ్‌డి రఫీ, వి.వెంకటేశ్వర్లు, ఎన్‌టి వెంకటేశ్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులను గుర్తించాలి

ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు

మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రవాణా కార్మికులను అసంఘటిత రంగ కార్మికులను గుర్తించి వారికి కార్మిక చట్టాలు వర్తింపజేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. జాతీయ డ్రైవర్స్ డే, ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. ఈ జెండాను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజనల్ కార్యదర్శి పి శ్రీనివాసరావు ఎగరవేశారు. ఆటో యూనియన్ స్టాండ్‌లో దాసరి రమేష్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జి. శ్రీనివాసులు మాట్లాడుతూ కేరళ తరహాలో సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రవాణా రంగం కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతున్న పెట్రోల్, డీజిల్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులుగా ఆటో, లారీ, జీపు, ట్రక్, అంబులెన్స్ ట్రాక్టర్ వంటి వాహన డ్రైవర్స్‌కు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి జీవన విధానాన్ని మెరుగుపరచాలని కోరారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కొన్ని డిమాండ్స్ తయారు చేసిందని వాటిని అధికారులతో ప్రభుత్వం చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు, జోనల్ అధ్యక్షులు దాసరి మల్లికార్జునరావు, ఒంగోలు డిపో అధ్యక్షులు వెంకటేశ్వర్లు డికె రావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో

మౌలిక వసతులను కల్పిస్తాం..

కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్

కార్యాలయాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాత రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన పాత రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. మొదట రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయం, రాష్ట్ర కుష్టు, ఎయిడ్స్ నివారణ సంస్థ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించి అందులోని మందులను కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ ఉపసంచాలకులు కార్యాలయాన్ని పరిశీలించి సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం సరిగ్గా లేదని అధికారులు ఈ సందర్భంగా ఆయన దష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఖాళీ స్థలంతోపాటు వినియోగంలో లేని బ్లాక్ ను కూడా తగిన మరమ్మతులు చేసి వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ఒంగోలు తహాశీల్దార్ మురళి, పలువురు అధికారులు ఉన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. వరుసగా ఐదో ఏడాది "వైఎస్ఆర్ రైతుభరోసా- పిఎం కిసాన్ " పథకం అమలులో భాగంగా 2023-24 కాలానికి మొదటి విడత ఆర్థిక సహాయాన్ని, ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలలో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను వారి బ్యాంకు ఖాతాలలో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం జమ చేశారు. ఈ మేరకు కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా ఒంగోలు లోని పాత జడ్పీ హాలులో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రా రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేష్ తోపాటు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అర్హులైన రైతులకు వారు బ్యాంకు చెక్కులను అందించారు. జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వం ఉందన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, ఇతర సేవల కోసం రైతులు ఎవరూ రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన పనిలేకుండా ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే సకాలంలో అందిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బేబీరాణి, ఏపిఎంఐపి పీడీ బి.రవీంద్ర బాబు, అధికారులు పాల్గొన్నారు.

అశ్రునివాళి

మా తమ్ముడు
కీ.శే. కొల్లి రామ మోహన రెడ్డి (రాంబాబు) గారు
తేదీ.19-05-2023
శుక్రవారం స్వర్గస్తులైనారు.

కీ.శే. కొల్లి రామమోహనరెడ్డి
(రాంబాబు) గారు
పోస్ట్ మాస్టర్ భవనం వారిపాలెం)

ఇట్లు... అన్న:
కొల్లి ఉదయ్ భాస్కర్‌రెడ్డి
మరియు
ఇతర కుటుంబ సభ్యులు.

తేదీ.02-06-2023 శుక్రవారం ఉదయం 9.గంటలకు బాపట్ల జిల్లా భవనం వారి పాలెంలో మా స్వగృహం నందు పెద్ద కర్మ జరుగును. కావున తెలియజేయడమైనది.